క్లుప్తంగా

ద్రౌపదీదేవికి ప్రత్యేక పూజలు


విశేష అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

పాలసముద్రం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ అనురేఖ, ఎంపీటీసీ లిఖిత తెలిపారు. మండలంలోని ఆముదాలలో డిప్యూటీ తహసీల్దార్ మధుబాబు, విస్తరణాధికారి రమేష్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. మండల స్థాయి అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీఓ మార్గరెట్, ఏపీఎం ఫరీద్‌మస్తాన్ ఎంఈఓ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు


వినాయకుని సన్నిధిలో సుమ, సునీత

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని యాంకర్ సుమ, సినీ గాయకులు సునీ త శుక్రవారం దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ ధనుంజయ స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగివేమనకు కలెక్టర్ నివాళి


నివాళి అర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : యోగి వేమన జయంతి కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి కలెక్టర్ షణ్మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ విశ్వదాభిరామ వినురవేమ అనే మకుటంతో వంద పద్యాలు రాసిన వేమన తెలుగు వారికి సుపరిచితమన్నారు. వేమనకు నివాళులర్పించిన వారిలో డీఆర్‌ఓ రాజశేఖర్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రబ్బాని బాషా, ఏఓ కులశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రూపు-2 మోడల్ పరీక్ష

చిత్తూరు కలెక్టరేట్ : నూతన సిలబస్‌కు అనుగుణంగా ఈ నెల 21న గ్రూపు-2 ఉచిత మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు కుట్టి స్టడీ సర్కిల్ డైరెక్టర్ పవనకుమారి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో నూతన సిలబస్ ప్రకారం ఉచిత మోడల్ పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం మిట్టూరులో ఉన్న కుట్టి స్టడీ సర్కిల్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులు 9491844963 కు వాట్సాప్‌కు వివరాలు పంపాలని తెలిపారు.

కాణిపాకంలో స్వచ్ఛ తీర్థ సేవ



కాణిపాకం(యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పరిసరాల్లో స్వచ్ఛ తీర్థ సేవా కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఐదో రోజు ఉదయం చైర్మన్ కార్యాలయ ఆవరణ, అతిథి భవనాలు, సబ్‌స్టేషన్, తదితర ప్రాంతాల్లో పరిశుభ్రం చేశారు. ఆలయ ఈఈ వెంక టేశు, ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న జెడ్పీటీసీ దొరస్వామి


వైద్య శిబిరానికి హాజరైన జనం

పెనుమూరు (కార్వేటినగరం): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత కల్పించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని జెడ్పీటీసీ దొరస్వామి అన్నారు. మండల పరిధిలోని శుక్రవారం రామకృష్ణాపురం సచివాలయంలో సర్పంచ్ వెంకటేష్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ సీఎం జగనన్న తన పాలనలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారని చెప్పారు. ఇటీవల ఫ్యామిలీ ఫిజిషియన్, తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష ప్రవేశపెట్టి ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా ఇస్తున్నారని గుర్తు చేశారు. స్థానికంగా నిర్వహించే వైద్య శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యులతో వైద్యం అందించడం, అవసరమైన పరీక్షలు చేయడం, ఉచితంగా మందులు అందించడం వంటి సేవలు అందుతున్నాయని చెప్పారు. మెరుగైన వైద్యం అవసరమైతే, ఆరోగ్యశ్రీ, నెట్‌వర్క్ ఆస్పత్రులకు సిఫార్సు చేసి కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్న జగనన్నకు ప్రజలు రుణపడి ఉండాలని పేర్కొన్నారు. శిబిరంలో అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసి పౌష్టికాహారం స్టాల్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, డీడీఓ ప్రభుకిరణ్, వైద్యాధికారులు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ మీనాసయ్యద్, ఏఎస్‌ఎం చైతన్య, మాజీ మండల కన్వీనర్ సురేష్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు దూదిమోహన్, దూది శంకర్, చక్రవర్తినాయుడు, ఐసీడీఎస్ పర్యవేక్షకులు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సురక్ష పేదలకు వరం

పాలసముద్రం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, మహేష్ బాబు తెలిపారు. శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం తహసీల్దార్ బాబు, వైద్యాధికారి మోహన్‌కృష్ణ సమక్షంలో సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 255 మంది పలు జబ్బులు ఉన్నవారి డాక్టర్లు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజీవ్‌కుమార్, ధరణి, సుధ, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఏఎన్‌ఎం, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పరిశీలన


కులగణన సర్వేను పరిశీలిస్తున్న నగరి ఆర్డీఓ సుజన

- ఆర్డీఓ సుజన

విజయపురం (నగరి): కులగణన సర్వే వేగవంతం చేయాలని నగరి ఆర్డీఓ సుజన ఆదేశించారు. శుక్రవారం కాళికాపురంలో కులగణన సర్వేను ఆమె పరిశీలించారు. సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ప్రజలు తమ వివరాలను తెలియజేయాలని కోరారు. అలాగే 10 రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్

వెదురుకుప్పం: పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం సెక్టోరియల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. మండలంలో 41 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఇందులో 26 పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు గుర్తించినట్లు తెలిపారు. ప్రధానంగా నీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌక్యాలు లేవని చెప్పారు. సంబంధిత పాఠశాలల్లో పాఠశాల నిధులతో ఈనెల 27వ తేదీ లోపు తప్పకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఏఓ వనిత, విద్యాశాఖ అధికారులు దామోదరం, మహేశ్వరరావు, ఏఈలు తిమ్మరాజు, మురళీ, ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు

ఆడుదాం ఆంధ్రా దేశానికే ఆదర్శం


నియోజకవర్గ ఖోఖో పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో అధికారులు




కబడ్డీ ఫైనల్స్ ఆడుతున్న వడమాలపేట, బీఎన్‌కండ్రిగ జట్లు, వాలీబాల్ ఆడుతున్న వడమాలపేట, పూడి జట్లు

పుత్తూరు: వడమాలపేట జెడ్పీ హైస్కూలు క్రీడా మైదానంలో శుక్రవారం ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో 12 సచివాలయాలకు సంబంధించిన క్రీడాకారులు తమ సత్తా చాటారు. హోరాహోరీగా సాగిన కబడ్డీ ఫైనల్స్‌లో వడమాలపేట జట్టు- బాలినాయుడుకండ్రిగ జట్టుపై విజయభేరి మోగించింది. వాలీబాల్ పోటీల ఫైనల్స్‌లో వడమాలపేటపై పూడి జట్టు విజయం సాధించింది. విన్నర్స్ జట్లను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపీడీఓ భానుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన పోటీలను పీడీలు చంద్రశేఖర్‌రాజు, శివప్రసాద్, నాగేంద్ర, రూపలత, హేరాంబకుమార్, వలంటీర్లు, సచివాల సిబ్బంది పర్యవేక్షించారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీడీఓ రామనాథరెడ్డి, ఏఓ విద్యావతి తెలిపారు. మండలంలోని వెంగళరాజు కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో శుక్రవారం మండల స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఈటీలు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


శివాలయం వీధిలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: గ్రామాల్లో మౌళిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ లత అన్నారు. మండల కేంద్రంలోని శివాలయం వీధి, టీవీఎం వీధిలో శుక్రవారం రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాల్లో కార్వేటి నగరం మండలం మొదటి స్థానంలో ఉందని చెప్పారు. సంక్షేమ పథకాలతో పాటు, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, మాజీ ఎంపీటీసీ మురగయ్య పలువురు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



సమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు, ట్యుటోరియల్ పూర్వ ఉపాధ్యాయులు

నగరి: మూడు దశాబ్దాల క్రితం నగరిలోని విజ్ఞాన్ ట్యుటోరియల్‌లో ట్యూషన్స్‌కు వెళ్లిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారి భవితకు బాటలు వేయడంలో ట్యుటోరియల్ టీచర్లు సైతం తమవంతు పాత్ర పోషించారు. కాలక్రమంలో వివిధ రంగాల్లో పూర్వ విద్యార్థులు స్థిరపడ్డారు. అలాగే, ట్యుటోరియల్‌లో పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు అధ్యాపకులుగా, ఎంఈఓలుగా, ప్రిన్సిపాళ్లుగా పనిచేసి కొందరు ఉద్యోగ విరమణ కూడా పొందారు. ఉపాధ్యాయులందరూ వెళ్లిపోవడంతో రెండు దశాబ్దాల క్రితమే ట్యుటోరియల్ కూడా మూతబడింది. అయితే అప్పుడు చదివిన విద్యార్థుల్లో ఏర్పడిన స్నేహ బంధం, గురువులపై ఉన్న గౌరవం మూడు దశాబ్దాల అనంతరం కలిసేలా చేసింది. అందరినీ ఒక్కటి చేయడంలో సామాజిక మాధ్యమం తనవంతు పాత్ర పోషించింది. దీంతో టీఆర్ కండ్రిగలోని విశ్రాంత గురువు ఇంట అందరూ కలుసుకున్నారు. తమ జ్ఞాపకాల పేజీలను మళ్లీ తిరగేసి ఆనందపు క్షణాలను ఆస్వాదించారు. గురుదేవులను సత్కరించి ఆశీస్సులు పొందారు. ఒక ప్రతి ఏటా సంక్రాంతి ముగింపులో కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు.

గుండెపోటుతో హెచ్‌ఎం మృతి


హరి (ఫైల్)

ఐరాల: పూతలపట్టు మండలం చిగరపల్లెమిట్టకు చెందిన హెచ్‌ఎం హరి(50) గుండెపోటుతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. మండలంలోని నాంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంగా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన తర్వాత గుండెపోటు రావడంతో కుప్ప కూలి తుదిశ్వాస విడిచారు.

నెలాఖరుకు టిడ్కో గృహాలు సిద్ధం

- పకడ్బందీగా కులగణన చేయాలి
- పరిసరాలు శుభ్రంగా ఉండాలి
- నగర పాలక సంస్థ కమిషనర్ అరుణ


చిత్తూరు నగరంలో టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగరపాలక పరిధిలో పూణేపల్లి వద్ద నిర్మిస్తున్న టిడ్కో గృహ సముదాయాలను ఈ నెలాఖరుకు పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని నగర కమిషనర్ అరుణ టిడ్కో అధికారులు, గుత్తేదారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం ఉదయం పూణేపల్లి వద్దనున్న టిడ్కో గృహ సముదాయాలను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న ఎలక్ట్రికల్, శానిటేషన్, రోడ్ల నిర్మాణం, మురుగునీటి కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. పనులన్నీ ఈ నెలాఖరుకు పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఆదేశించారు. పూణేపల్లి టిడ్కో గృహ సముదాయంలో 300 చదరపు అడుగులు ఇళ్లు 2,256 ఉండగా, 365 చదరపు అడుగుల గృహాలు 240, 430 చదరపు అడుగుల గృహాలు 336 మొత్తం 2,832 గృహాలను సిద్ధం చేసినట్లు కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో టిడ్కో ఈఈ వెంకటముని, సీఎంఎం గోపి, టిడ్కో కన్సల్టెంట్ ధనంజయ రెడ్డి, కాంట్రాక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

తప్పిదాలు లేకుండా కులగణన సర్వే

కుల గణన సర్వే పకడ్బందీగా, తప్పిదాలు తావులేకుండా చేయాలని కమిషనర్ అరుణ అన్నారు. కుల గణన సర్వే తీరును కమిషనర్ శుక్రవారం సత్యనారాయణపురం, వెంకటేశ్వర కాలనీ పరిధిలో పరిశీలించారు. వలంటీర్ యాప్‌లో కుల గణన సర్వేకు సంబంధించిన వివరాల నమోదు అంశాన్ని తనిఖీ చేశారు. ఇంటింటి సర్వే ఏ విధంగా చేస్తున్నారంటూ వలంటీర్లు, వార్డు కార్యదర్శులతో మాట్లాడారు. కమిషనర్ మాట్లాడుతూ, క్లస్టర్ వారీగా మ్యాపింగ్ చేసిన వలంటీర్లు, వార్డు కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి సర్వే పూర్తి చేయాలని చెప్పారు. సర్వే సందర్భంగా ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, యాప్‌లో నిర్దేశించిన మేర సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని స్పష్టం చేశారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేయాలని, ఇందుకోసం క్లస్టర్ వారీగా వలంటీర్లు రోజువారీ నిర్దేశించిన గృహాల సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంఎం గోపి, వార్డు కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మంత్రి ఉషశ్రీ చరణ్

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం వీఐపీ విరామ సమయంలో ఏపీ మహిళా శిశు సంక్షేమ శాఖామంత్రి ఉషశ్రీ చరణ్ దర్శించుకున్నారు. అనంతరం ఆమెకు రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల మార్పులు, చేర్పులు సీఎం జగన్ ఆదేశానుసారం జరిగినట్టు పేర్కొన్నారు. తమ బ్రాండ్ సీఎం జగన్‌నేనని వివరించారు. 175/175 టార్గెట్ రీచ్ అవ్వడం ఖాయమన్నారు. ప్రజలు సీఎం జగన్ మోహన్ రెడ్డినే సీఎం చేయాలని కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజల వద్దకే సంక్షేమ ఫలాలు, అభివృద్ధి తీసుకెళ్లిన ఘనత సీఎం జగన్‌కు దక్కినట్టు తెలిపారు. సీటు రాని ఎవరిలోనూ అసమ్మతి లేదని, అందరూ జగన్ వెంటే నడుస్తున్నారని స్పష్టం చేశారు. అదేవిధంగా తెలంగాణ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

17నుంచి రోబో ట్రాక్ పోటీలు

తిరుపతి(అలిపిరి): తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు వచ్చేనెల 17, 18వ తేదీల్లో రోబోట్రాక్- 2024 పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ప్రొఫెసర్ రాళ్లపల్లి రామమూర్తి, ఎస్వీయూ మాజీ వీసీ సుదీప్తా సాహా శుక్రవారం స్థానిక సైన్స్ సెంటర్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మొదటి రోజు పోటీల్లో బృందం లైన్- ఫాలోయింగ్ రోబోట్ పని చేసే విధానంపై ప్రోగ్రామింగ్ చేయాలని తెలిపారు. రెండో రోజు రోబోట్ ట్రాక్‌పై కనిష్ట కాలవ్యవధిలో గమ్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ పోటీలో విజేతలకు నగదు మొదటి బహుమతిగా రూ.5,000, రెండో బహుమతిగా రూ.3,000, తృతీయ బహుమతిగా రూ.2,000 అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే వారందరికీ సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 12 లోపు తమ దరఖాస్తులను పంపాలన్నారు. వివరాలకు 0877-2286202, 79896 94681 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మామిడికి పచ్చపురుగు బెడద


పచ్చపురుగు, ఆకు ముడత తెగుళ్లకు మందులు పిచికారీ చేస్తున్న రైతు


మామిడి తోటను కమ్మేసిన పొగ మంచు

పాలసముద్రం: ఎడతెరపిలేని మంచు, పచ్చపురుగు దెబ్బకు మామిడి పంట దెబ్బతింటోంది. వచ్చిన కాస్త పూత కూడా రాలిపోతోంది. గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో సుమారు 10 వేల ఎకరాల్లో మామిడి తోటలున్నాయి. ఆముదాల, బాలక్రిష్ణాపురం, వనదుర్గాపురం, గంగమాంబపురం, కేజే పురం, వెంగళరాజుపురం, తిరుమళరాజుపురం, శ్రీకావేరిరాజుపురం పంచాయతీల్లో మామిడి తోటలు సాగుచేస్తున్నారు. మామిడి తోటల్లో డిసెంబర్ నుంచి పూత విరబూసింది. కాతకొచ్చే సమయంలో పచ్చ పురుగు ఆశించడం వల్ల వచ్చిన పూత వచ్చినట్టే పోతోంది. మామిడి చెట్లు పూత దశకు వచ్చే సమయంలో ఈ ఏడాది పొగ మంచు, పచ్చ పురుగు కబళించింది. పచ్చ రంగులో ఉండే ఈ పురుగులు పూతను తినేస్తున్నాయి. విపరీతమైన మంచు ప్రభావంతో పూత మాడిపోతుంది. పూతను కాపాడేందుకు రైతులు అనేక కష్టాలు పడుతూ మందులు పిచికారీ చేస్తున్నారు. దీనికితోడు ఆకు ముడత తెగులు కూడా ఆశించింది. మంచు అధికంగా పడుతుండడంతో మామిడి పూత పింజ కాకుండా మాడిపోతోంది. సకాలంలో చర్యలు తీసుకోకపోతే మామిడి పంట పూర్తిగా దెబ్బతినే అవకాశముంది. దీంతో రైతాంగం ఆందోళనలో మునిగిపోతోంది.